నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | WARANGAL



## ట్రెక్కింగ్ చేసి.. గుట్ట ఎక్కి..

నిత్యం ప్రజా సమస్యలతో బిజీగా ఉండే జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాస్‌లు ఆదివారం సరదాగా ట్రెక్కింగ్ చేశారు. రేగొండ మండలంలోని పాండవుల గుట్టను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే సందర్శించారు. ట్రెక్కింగ్ చేస్తూ గుట్ట పైకి చేరుకొని కొద్దిసేపు ఉల్లాసంగా గడిపారు. పాండవుల గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు.

-రేగొండ, సెప్టెంబర్ 29



టింబర్ డిపోలో ఉన్న కలప (ఫైల్)

## ఆన్‌లైన్ సిస్టం ఉన్నా ఆగని దందా

### కలప పర్మిట్ పేరిట అక్రమ వసూళ్లు

- రూ. 500 వరకు చెల్లిస్తేనే అప్రూవల్
- తీరు మారని అటవీ శాఖ అధికారులు
- టింబర్ డిపోలు, సామిల్ యజమానులకు తప్పని తిప్పలు

సుబేదారి, సెప్టెంబర్ 29 : కలప, అటవీ ఉత్పత్తుల తరలింపు కోసం కేంద్ర అటవీ శాఖ వన్ నేషన్-వన్ పర్మిట్ పేరిట ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయినప్పటికీ అటవీ అధికారుల అక్రమ వసూళ్ల దందా ఆగడం లేదు. గతంలో కలపకు మాన్యువల్‌గా పద్ధతిలో పర్మిట్లు ఇచ్చేందుకు టింబర్ డిపోలు, సామిల్ యజమానుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకునేవారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం ఉన్నా వారిలో మార్పు రాలేదని వారు వాపోతున్నారు. హనుమకొండ జిల్లాలో 100 వరకు టింబర్ డిపోలు, సామిల్స్ ఉన్నాయి. గృహావసరాలకు వినియోగించడానికి టేకు, ఇతర కలప కోసం ఫారెస్ట్ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. ఇందుకోసం టింబర్ డిపో యజమాని తప్పనిసరిగా స్థానిక రేంజ్ ఆఫీసర్ ద్వారా పర్మిట్ తీసుకొని కలప విక్రయించాలి. పర్మిట్ కోసం రూ. 100 చెల్లించి నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టం పోర్టల్‌లో డిపో లైసెన్స్, ఫోన్ నంబర్, కలప రకం, సైజు, రవాణా చేసే ప్రాంతం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలి.

**రూ. 500 వరకు వసూలు..**

హనుమకొండ జిల్లా అటవీ శాఖ అధికారులు కలప పర్మిట్లకు టింబర్ డిపో, సామిల్ యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పర్మిట్ జారీచేయాల్సిన రేంజ్ ఆఫీసర్ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే సర్టిఫై చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపించి, సంబంధిత టింబర్ డిపో యజమాని నుంచి ఒక్కో పర్మిట్‌కు రూ. 300 నుంచి రూ. 500 తీసుకున్న తర్వాతనే అప్రూవల్ కోసం ఫైల్‌ను పైస్థాయి అధికారికి పంపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంలో హనుమకొండ అటవీ శాఖ కార్యాలయంలో పర్మిట్ ఇచ్చే సెక్షన్ సిబ్బందికి, రేంజ్ ఆఫీసర్లకు మధ్య పంపకాల్లో విభేదాలు వచ్చాయి. ఆన్‌లైన్ డాటా చేసే కంప్యూటర్ సిబ్బందికి ఒక్కో పర్మిట్‌కు రూ. 30 మాత్రమే ఇస్తుండడంతో వాటిని పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం దానిని రూ. 50కి పెంచి టింబర్ డిపోల నుంచే వసూలు చేస్తున్నట్లు యజమానులు చెబుతున్నారు. ఈ దందా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతున్నట్లు సమాచారం.

### కొన్ని సంఘాల నుంచి డీలర్లకు..

పీఏసీఎస్‌లు, ఓడీసీఎంఎస్‌లు, ఏఆర్‌ఎస్‌కే, ఇతర సంఘాల్లో కొన్ని యూరియా నిల్వలను అందుబాటులో పెట్టకపోతుండగా మరికొన్ని వ్యవసాయ శాఖ తమకు కేటాయించిన యూరియా నిల్వల్లో కొన్నింటిని లాభాలపై ఎరువుల డీలర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. మార్క్‌ఫెడ్ నుంచి వచ్చిన యూరియా నిల్వల్లో కొన్నింటిని తమ గోదాములకు, మరికొన్నింటిని ఎరువుల డీలర్ల గోదాములకు తరలిస్తున్నట్లు సమాచారం. తద్వారా టన్ను లెక్కన అవగాహన మేరకు ఆర్థికంగా లబ్ధిపొందుతున్నట్లు తెలిసింది. కొన్ని పీఏసీఎస్‌లు, ఏఆర్‌ఎస్‌కేలతోపాటు ఇతర సంఘాల్లోనూ ఇదే జరుగుతున్నట్లు రైతు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఈ అక్రమ దందాకు వ్యవసాయశాఖలోని కొందరు అధికారుల సహకారం ఉందనే ఆరోపణలున్నాయి. ఇటీవల చెన్నారావుపేట పీఏసీఎస్ పరిధిలోని పాపయ్యపేట బ్రాంచ్ నుంచి సేల్స్‌మెన్ ఎం శ్రీనివాస్ స్థానిక రైతుల పేర్లను నమోదు చేసి 74 యూరియా బస్తాలను పొరుగున ఉన్న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం యజమానికి అమ్మగా ట్రాన్స్‌పోర్టు విషయంలో వాహనాల యజమానుల మధ్య తలెత్తిన వివాదం వల్ల బయటపడింది. విచారణలో రుజువు కావడంతో జిల్లా సహకార అధికారి పాపయ్యపేట బ్రాంచ్ సేల్స్‌మెన్ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో జిల్లాలో సంఘాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.





# ధర పెంచి.. దగా!

## యూరియా అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘన

### ఒక్కో బస్తా రూ.350 వరకు విక్రయిస్తున్న డీలర్లు

- కొన్ని పీఏసీఎస్‌లు, ఓడీసీఎంఎస్‌లు, ఏఆర్‌ఎస్‌కేల్లో స్టాక్ నిల్
- విధిలేని పరిస్థితుల్లో ఎరువుల డీలర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- పలు సంఘాల నుంచి డీలర్లకు చేరుతున్న యూరియా నిల్వలు
- కొరవడిన అధికారుల నిఘా, పర్యవేక్షణ.. అక్రమాలకు హెల్ప్

వరంగల్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఎరువుల అమ్మకాల్లో అధికారుల నిఘా, పర్యవేక్షణ పూర్తిగా కొరవడడం రైతులకు శాపంగా మారింది. ప్రధానంగా మార్కెట్‌లో యూరియా ధరకు రెక్కలొచ్చాయి. ఎమ్మార్పీ (గరిష్ఠ ధర) అమలు కావడం లేదు. ధర పెంచి విక్రయిస్తూ ఎరువుల డీలర్లు రైతుల జేబులను లూటీ చేస్తున్నారు. ఒక్కో యూరియా బస్తా (50 కిలోల)కు ఎమ్మార్పీ రూ.267 ఉంటే రూ.320 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. యూరియా విక్రయాల్లో ఓపెన్‌గా ఎమ్మార్పీ ఉల్లంఘన జరుగుతున్నా, నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. ఒక్కో యూరియా బస్తాకు ఎమ్మార్పీ కంటే అదనంగా రూ.50 నుంచి రూ.80 వరకు రైతుల నుంచి గుంజుతున్నారు. నర్సంపేట, వర్ధన్నపేట వ్యవసాయ డివిజన్లలో ఇటీవలికాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాల్లో వానకాలం వరి నాట్లు కొంత ఆలస్యం కావడంతో రైతులు ఇంకా కొద్ది రోజులపాటు యూరియాను వినియోగించే అవకాశం ఉంది.

**కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు**

యూరియాను ఎమ్మార్పీపై రైతులకు అందించాలని, అవసరమైన నిల్వలను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయా జిల్లాలకు కేటాయిస్తున్న యూరియా నిల్వల్లో 60 శాతం పీఏసీఎస్‌లు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు (ఏఆర్‌ఎస్‌కే), ఓడీసీఎంఎస్, ఎఫ్‌ఎస్‌సీఎస్, రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవో), ఆర్‌ఎస్‌పీఎస్‌ఎస్, ఎఫ్‌పీసీఎల్, ఏరువాక రైతు సంఘం వంటి వాటికి, మిగిలిన 40 శాతం యూరియాను ఎరువుల డీలర్లకు కేటాయిస్తున్నది. మార్క్‌ఫెడ్ ద్వారా యూరియాను పొందుతున్న పీఏసీఎస్‌లు, ఓడీసీఎంఎస్, ఏఆర్‌ఎస్‌కేలు, ఎఫ్‌పీవోలు, ఇతర సంఘాలు రైతులకు ఎమ్మార్పీ రూ. 267 చొప్పున ఒక్కో బస్తాను అమ్మకం జరపాల్సి ఉండగా, హమాలీ చార్జీతో కలిపి రూ. 275 లెక్కన విక్రయిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఇటీవల కలెక్టర్ సత్యశారద జిల్లాలో ఎరువులపై జరిగిన సమీక్షలో ప్రతి పీఏసీఎస్, ఓడీసీఎంఎస్, ఏఆర్‌ఎస్‌కేలు, ఎఫ్‌పీవోలు, ఇతర సంఘాల్లో రైతుల కోసం యూరియా అందుబాటులో ఉండాలని, ఆయా సంఘాల్లో కచ్చితంగా యూరియా స్టాక్ ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె ఆదేశాలను అధికారులతోపాటు సంఘాల నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. దీంతో కొన్ని సంఘాల్లో యూరియా అందుబాటులో లేక రైతులకు దొరకడం లేదు. ఉదాహరణకు జిల్లాలో కొన్ని పీఏసీఎస్‌లు, ఇతర సంఘాల్లో ఒక్కో సంఘంలో ప్రస్తుత వానకాలం సీజన్‌లో వందల టన్నుల యూరియా సరఫరా జరిగితే కొద్ది రోజుల క్రితం వరకు ఖానాపురం, బుధరావుపేట ఓడీసీఎంఎస్‌లకు కేవలం 9.99 టన్నుల చొప్పున, నెక్కొండ ఎఫ్‌పీసీఎల్‌కు 11.97, వర్ధన్నపేట మండలం నల్లబెల్లి పీఏసీఎస్, వరంగల్ పీఏసీఎస్, ఓడీసీఎంఎస్, పర్వతగిరి ఏఆర్‌ఎస్‌కేకు 19.98 టన్నుల చొప్పున యూరియా సరఫరా జరిగింది. ఖానాపురం ఏఆర్‌ఎస్‌కే, గీసుగొండ, విశ్వనాథపురం ఓడీసీఎంఎస్, మహ్మదాపురం ఓడీసీఎంఎస్, నర్సంపేట ఏఆర్‌ఎస్‌కే-2, చింతలపల్లి పీఏసీఎస్‌లదీ ఇదే పరిస్థితి. సంఘాల్లో స్టాక్ లేకపోవడంతో మార్కెట్‌లో డీలర్ల వద్ద ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బు చెల్లించి యూరియా కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు తెలిపారు.



బొగతకు పర్యాటకుల ఫిదా

ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతానికి ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం వ్యూ పాయింట్‌లో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. స్విమ్మింగ్‌పూల్‌లో స్నానాలు చేశారు. బొగత అందాలకు ఫిదా అయ్యారు.

– వాజేడు, సెప్టెంబర్ 29



మటన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

## లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

### 16 మందిపై కేసులు నమోదు

నమస్తే ఎఫెక్ట్

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 29 : ఎట్టకేలకు లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వరంగల్, హనుమకొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించి, పలు కేసులు నమోదు చేశారు. 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 27న 'ఆ శాఖలో అందరూ ఇన్‌చార్జీలే... మూడు నెలల నుంచి కరువైన అధికారుల పర్యవేక్షణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్‌లోని అండర్ బ్రిడ్జి, గవిచర్ల క్రాస్ రోడ్డు, శంభునిపేట ప్రాంతాల్లో చేపలు, చికెన్, మటన్ అమ్మకాలను పరిశీలించారు. చాలా మంది ముద్రించని బాట్లతో తూకం వేయడం, తక్కువ తూకంతో అమ్మడం, రెన్యువల్ చేయించుకోని తరాజులు వాడడాన్ని గుర్తించారు. అలాగే రోడ్డుపై కూరగాయాలు, ఇతర వస్తువుల అమ్మకాలను పరిశీలించారు. దాదాపు 25 చోట్ల దాడులు నిర్వహించి, 9 కేసులు నమోదు చేయడంతో పాటు రూ.8,500ల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు.. అలాగే హనుమకొండలోని శాయంపేట, డబ్బాలు తదితర 20 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి 7 కేసులు నమోదు చేయడంతో పాటు రూ. 9,500ల కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. వరంగల్ లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ సిద్ధార్థకుమార్ ఆదేశాల వరకు దాడులు నిర్వహించినట్లు లీగల్ మెట్రాలజీ అధికారులు శ్రీలత, అజీజ్ తెలిపారు. వ్యాపారులు వినియోగదారులను మోసం చేయొద్దని, తాము ఆకస్మికంగా తనిఖీలు చేపడుతామని వారు హెచ్చరించారు.

## ఏటూరునాగారానికి అదనపు బస్సులు

### నేటి నుంచి అందుబాటులోకి నాలుగు సెమీ డీలక్స్‌లు

ములుగు, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ నుంచి ములుగు మీదుగా ఏటూరునాగారానికి అదనపు బస్సు సర్వీసులను నడిపించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 24న 'నమస్తే తెలంగాణ'లో 'ములుగు చేరేది ఎపుడో..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్టీసీ వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న అదనపు బస్సులు నడుపుతామని ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివారం ఆర్టీసీ వరంగల్ రీజనల్ మేనేజర్ డీ విజయభాను నాలుగు అదనపు సెమీ డీలక్స్ బస్సు సర్వీసులను సోమవారం నుంచి నడిపిస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. హనుమకొండ బస్టాండ్ నుంచి ఉదయం 7.30, 8.45, మధ్యాహ్నం 1.20, 2.15 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. అలాగే ఏటూరునాగారం నుంచి ఉదయం 10.10, 11.30, సాయంత్రం 4.00, 5.00 గంటలకు ములుగు మీదుగా హనుమకొండకు బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు. ములుగు జిల్లా ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్‌ఎం సూచించారు.

## మూగబోతున్న సప్తస్వరాలు

### నిర్లక్ష్యంలో 'సరిగమపదనిస' పార్కు

- అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఎండిపోయిన పార్కు, పడిపోయిన విగ్రహాల ముక్కలు



పార్కులో మందు సీసాలు




కూలిపోయిన ఆర్చ్

హనుమకొండ, సెప్టెంబర్ 29 : సప్త స్వరాల 'సరిగమపదనిస' పార్కు మూగబోతున్నది. సంగీత ప్రియులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు ఉనికిని కోల్పోతున్నది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నది. చారిత్రక, పర్యాటక నేపథ్యం ఉన్న పద్మాక్షి ప్రాంతంలో అగ్గలయ్యగుట్ట, పద్మాక్షి, సిద్ధేశ్వర తదితర చారిత్రక దేవాలయాలున్నాయి. ఇక్కడ రెండేళ్ల క్రితం రూ.కోటి నిధులతో సంగీత ప్రియుల కోసం నిర్మించిన ఈ పార్కులో దేశంలోని వివిధ రాష్ర్టాలు, ప్రాంతాలకు చెందిన సంగీత నృత్య భంగిమలున్న విగ్రహాలను ఏర్పాటు చేశారు. 'సరిగమపదనిస'లను తెలియజేసే ఏడు విగ్రహాలను నెలకొల్పారు. పార్కు ముందు భాగంలో ఆర్చిని రూపొందించి గ్రీనరీ ఏర్పాటు చేశారు. ఒడిశా నుంచి సాండ్ స్టోన్‌ను తెప్పించి విగ్రహాలను చెక్కించారు. ఇలాంటి పార్కును అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి పూట లైట్లు లేకపోవడంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. ఎక్కడ చూసినా తాగి పడేసిన బీరు, బ్రాంది సీసాలే దర్శనమిస్తున్నాయి. అలాగే విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని పార్కును వినియోగంలోకి తీసుకురావాలని సంగీత ప్రియులు, ప్రజలు కోరుతున్నారు.

## టెస్కో.. జర చూస్కో!

- నేత సంఘాల్లో పేరుకుపోతున్న బెడ్‌షీట్లు
- ఏడాదిగా కొనుగోళ్లు చేపట్టని సంస్థ
- ఆర్థిక ఇబ్బందుల్లో సంఘాలు, నేతన్నలు
- అప్పులు చేసి కూలీ చెల్లిస్తున్న బాధ్యులు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 29 : చేనేత సంఘాల ద్వారా ఉత్పత్తి చేసిన బెడ్‌షీట్లు సంఘాల్లో మూలుగుతున్నాయి. టెస్కో ద్వారా కొనుగోళ్లు లేకపోవడంతో సంఘాలు చతికిల పడే పరిస్థితి ఏర్పడింది. ఏడాదిగా కొనుగోళ్లు జరగకపోవడంతో ఉత్పత్తులు పేరుకుపోతున్నాయని ఆయా సంఘాల ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో దాదాపు 54 వరకు చేనేత సహకార సంఘాలు, 26 వరకు మాక్స్ సంఘాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా చేనేత సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న కార్మికులకు రోజు, నెలవారీ కూలీతో పాటు తాము తయారు చేసిన ఉత్పత్తులను బట్టి రేట్లను చెల్లిస్తారు. చేనేత సంఘాల మీద ఆధారపడి కూలీ రేట్ల ప్రకారం నేస్తున్న నేతన్నలకు ఇచ్చే వేతనం కూడా పెండింగ్‌లో ఉండటంలో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఉత్పత్తి చేస్తున్న బెడ్‌షీట్లను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో సంఘాలు నడిచే పరిస్థితి లేదంటూ బాధ్యులు చెబుతున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటూ కార్మికులకు కూలీ చెల్లించాల్సి వస్తున్నదన్నారు. గతంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం టెస్కో ద్వారా మూడు, ఆరునెలలకోసారి కొనుగోలు చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తలేదన్నారు. గతేడాది నవంబర్‌లో టెస్కో అధికారులు కొనుగోలు చేశారని, ప్రస్తుతం ముందుకు రావడం లేదని వాపోతున్నారు. సంఘాల్లో బెడ్‌షీట్లు నిల్వ ఉంచడానికి కూడా స్థలం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చేనేత సహకార సంఘంలో నిల్వ ఉన్న బెడ్‌షీట్లు

**రూ. కోట్లలో స్టాకు..**

వరంగల్‌లోని కొత్తవాడ, ఆటోనగర్, తుమ్మకుంట, ఎల్‌బీనగర్, ఉర్సు కరీమాబాద్‌తో పాటు పత్తిపాక శాయంపేట, సూరారం, కమలాపురం, జమ్మికుంట, వీణవంక ప్రాంతాల్లోని చేనేత సంఘాల్లో రూ.10 కోట్ల వరకు స్టాకు నిల్వ ఉంది. ఒక్క కొత్తవాడలోనే రూ. కోటిపైన నిల్వ ఉన్నట్లు తెలుస్తున్నది. అలాగే కార్పెట్లను కూడా నాలుగు నెలల నుంచి కొనుగోలు చేయకపోవడంతో రూ.3 కోట్ల వరకు నిల్వ ఉన్నాయని నేత సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఇకనైనా టెస్కో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బెడ్‌షీట్లను కొనుగోలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## గీత కార్మికులందరికీ రెండేళ్లలో రక్షణ కిట్లు

### పాపన్న విగ్రహావిష్కరణలో మంత్రి పొన్నం

లింగాలఘనపురం, సెప్టెంబర్ 29 : రెండేళ్లలో గీత కార్మికులకు రక్షణ కిట్లు ఇస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జనగామ జిల్లా లింగాలఘనపురంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీత వృత్తిని నమ్ముకొని వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగానే కాటమయ్య సేఫ్టీకిట్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. జనగామ జిల్లాకు సర్వాయిపాపన్న పేరు పెట్టేలా సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తానన్నారు. రాష్ట్రంలోని గీత కార్మికులకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియా, బకాయిలను త్వరలో చెల్లిస్తామని పొన్నం తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు.













